ప్రజాశక్తి
సోమవారం 20 మే, 2024

అల్లర్లు సృష్టిస్తే చర్యలు

ప్రజాశక్తి- పలాస

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో సంబంధించి సమస్యాత్మక గ్రామాలు గుర్తించామన్నారు. రౌడీషీటర్లనూ పిలిపించి బైండోవర్ కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ప్రజలకు ఇబ్బంది పెట్టే కార్యక్రమాలను ఏ రాజకీయ నాయకులు చేయడానికి వీలులేదన్నారు. శాంతిభద్రత సమస్యలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొబ్బరికి 'గ్యానోడెర్మా' దెబ్బ

ఖాళీ అవుతున్న తోటలు

ప్రజాశక్తి- కవిటి

ఉద్దానం కొబ్బరి రైతును గ్యానోడెర్మా తెగులు కోలుకోలేని దెబ్బ తీస్తోంది. ఈ తెగులు సోకిందా? ఇక అంతేమరి. ఈ తెగులు దెబ్బకు ఎకరాలకు ఎకరాల్లో కొబ్బరి చెట్లు చెట్లు చనిపోతుండడంతో తోటలు ఖాళీ అవుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయంగా రైతులు జీడి పంట వైపు చూస్తుండడంతో క్రమేపీ జీడి పంట విస్తీర్ణం పెరుగుతోంది.

తెగుళ్ల లక్షణాలు

గానోడెర్మా తెగులు నేలలో ఉండే బూజు జాతి శిలీంధ్ర బీజాల వల్ల కొబ్బరికి సోకుతుంది. గానోడెర్మా తెగులు తీవ్రత భూమిలో నుంచే వేర్లను ఆశిస్తుంది. ఈ దశలో తెగులును గమనించకపోతే అధిక శాతం వేర్లు కుళ్లిన తరువాత కాండంలోకి వ్యాపించి కణాలు పూర్తిగా కుళ్లేలా చేస్తుంది. అయితే ఈ కుళ్లు భూమిలోను, కాండంలోనూ అంతర్గతమవడం వల్ల బయటకు కనిపించదు. ఈ దశలో కాండం మొదలు చుట్టూ ఉన్న చిన్నచిన్న పగుళ్ల నుంచి ముదురు గోధుమ రంగు, తెలుపు వర్ణం కలిగిన చిక్కటి జిగురు వంటి ద్రవం కారడం గమనించవచ్చు. కాండంలోని కణ సముదాయం పూర్తిగా కుళ్ళిపోవడం వల్ల చెట్టు తనకు అవసరమైన నీరు, పోషక లవణాలను భూమి నుండి తీసుకోలేకపోతుంది. ఈ దశలో కాండం మొదలు చుట్టూ ముందుగా చిన్న చిన్న పగుళ్ల ద్వారా జిగురు కారుతుంది. ఈ బంక కారడం క్రమేణా పైకి వ్యాపించి తెగులు సోకిన చెట్టు, ఆకులు పసుపు వర్ణానికి మారి వడలిపోయి గోధుమ వర్ణానికి మారతాయి. కొత్త ఆకులు ఆలస్యంగా రావడం వల్ల తెగులు సోకిన చెట్టుపై అకుల సంఖ్య తక్కువగా ఉండడం గమనించవచ్చు. అదే విధంగా ఆకు పరిమాణం కూడా తగ్గిపోతుంది. తెగులు సోకిన కొబ్బరి మొక్కల్లో పుష్పాల సంఖ్య బాగా తగ్గిపోవడమే కాకుండా మగ పుష్పాల సంఖ్య పెరిగి ఆడపుష్పాల సంఖ్య బాగా తగ్గిపోతుంది. పిందెలు, కాయలు రాలడం కూడా ఈ తెగులు లక్షణమే. ఈ తెగులు ఆశించిన కొబ్బరి చెట్టు వేర్లను గమనించినట్లయితే పూర్తిగా కుళ్లిపోయి నలువు రంగులో మారడం చూడవచ్చు. తెగులు తీవ్రంగా ఉన్న చెట్లలో సుమారు 70 శాతం వేర్లు కుళ్లిపోయి ఉంటాయి. కొత్త వేర్లు పుట్టవు. ఈ క్రమంలో ఏ మాత్రం అశ్రద్ధ చేసినా తెగులు తీవ్రమై చెట్టు ఆకులు పసుపు వర్ణంలోకి మారి వేలాడిపోయే దశకు చేరుకుంటాయి. తరువాత మొవ్వు భాగం మొత్తం వడలిపోయి చెట్టు ఎండిపోతుంది. ఆ తరువాత కొబ్బరి ఆకులు పూర్తిగా రాలిపోవడంతో కాండం మొండిగా తయారై చెక్కిన పెన్సిల్ మొన మాదిరిగా చెట్టు కనిపిస్తుంది. తరువాత 5, 6 నెలల్లో చెట్టు చనిపోతుంది. తెగులు సోకి చివరి దశలో ఉన్న చెట్ల మొదళ్లపై పుట్టగొడుగులు మొలుస్తాయి. ఈ గానోడెర్మా తెగులను పుట్టగొడుగులు ఏర్పడే వరకు రానివ్వడం అత్యధిక ప్రమాదకరం. బలమైన గాలులు వీచేటప్పుడు ఈ గానోడెర్మా తెగులు సోకి చనిపోయిన చెట్టు, అడుగు భాగంలో విరిగి పడిపోవడం కొబ్బరి తోటల్లో గమనించవచ్చు. ఈ పడిపోయిన కొబ్బరి దుంగలను గమనించినప్పుడు దుంగ లోపలి భాగం కుళ్లిపోయి గుల్ల మాదిరిగా ఉంటుంది. తోటలో గానోడెర్మా తెగులు లక్షణాలు గమనించిన వెంటనే తెగులు ఉన్న ప్రాంతంలో ఒక మీటరు లోతు, 50 సెంటీమీటర్ల వెడల్పు గల గోతిని తవ్వి తెగులు సోకిన చెట్ల నుంచి వేరు చేయాలి. ఈ విధంగా చేయడం వల్ల తెగులు సోకిన చెట్ల వేర్ల వద్ద ఉన్న తెగులు కలుగచేసే శిలీంధ్ర బీజాలు ఆరోగ్యవంతమైన చెట్టు దగ్గరికి వెళ్లవు.

గ్యానోడెర్మా సోకిన చెట్టు

ఏంటీ గ్యానోడెర్మా

కొబ్బరి తోటలను ఆశించే తెగుళ్లలో గానోడెర్మా తెగులు ప్రమాదకరమైంది. దీన్ని సిగతెగులు, ఎర్రలక్క తెగులు, బంకకారు తెగులు, పొట్టులక్క తెగులు అని కూడా పిలుస్తారు. ఈ తెగులు నల్ల నేలలు కంటే తేలిక నేలల్లో వేసే కొబ్బరి తోటల్లో ఎక్కువగా కనబడుతుంది. వ్యాప్తి కూడా తేలిక నేలల్లో ఎక్కువగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువగా ఉంటే వ్యాధి వ్యాప్తి తక్కువగా ఉంటుంది. ఈ తెగులు తీవ్రత, తెగులు వ్యాప్తి నీటి ఎద్దడి అధికంగా ఉండే తోటల్లో ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా రైతులు, కొబ్బరి చెట్ల వేర్లను నరికి వేయడం చేస్తుంటారు. అలా చేయడంతో కొబ్బరి వేర్లకు గాయం ఏర్పడి నేలలో ఉండే గానోడెర్మా తెగులు కలుగచేసే శిలీంధ్ర బీజాలు గాయమైన వేర్ల ద్వారా చెట్లను ఆశించి వ్యాధి విస్తరిస్తుంది.

నివారణ చర్యలు

తోటలో చనిపోయిన, తెగులు ఎక్కువగా సోకిన చెట్లను వేర్లతో సహా పెకలించి తగులబెట్టాలి. లేదంటే చనిపోయిన చెట్ల కాండంపై పుట్టగొడుగులు మొలిచి తెగులు వ్యాప్తిని నిరోధించడం కష్టమవుతుంది. అలాగే కొత్త మొక్కలను నాటేటప్పుడు చెత్త వేసి కాల్చిన గోతుల్లో బాగా చివికిన పశువుల ఎరువు, కంపోస్టు ఎరువులతో పాటు 50 గ్రా. ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంద్రపు పొడిని కిలో వేపపిండి మిశ్రమంలో నింపి మొక్కను నాటాలి. గానోడెర్మా తెగులు కలిగించే సిలీంద్ర బీజాలు నేలలో ఉండి తెగిన లేక దెబ్బతిన్న వేర్ల ద్వారా చెట్లకు వ్యాపిస్తుంది. కాబట్టి కొబ్బరి చెట్ల వేర్లు నరకడం, వేర్లు తెగునంత వరకు లోతుగ దుక్కి చేయుట పనికిరాదు. ఎట్టి పరిస్థితుల్లోను చెట్ల వేర్లు నరకకూడదు.

ఈ తెగులు ఎక్కువగా తేలిక నేలల్లో వస్తుంది. అందువల్ల ఈ తేలిక నేలల్లో జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట పంటలు చిక్కగ పెంచి పూతకు వచ్చే దశలో భూమిలో కలియదున్నాలి. చెట్ల మొదలు చుట్టూ రెండు మీటర్ల వ్యాసార్ధం గల పళ్లాలు చేసి, బోదెల ద్వారా ప్రతి చెట్టుకు విడివిడిగా నీరు పెట్టాలి.

'నాగావళి'లో యువకుడు మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మృతి చెందిన రమేష్

నగరంలోని బాదుర్లపేటకు చెందిన పి.రమేష్ (18) పొన్నాడ వంతెన వద్ద నాగావళి నదిలో మునిగి మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని కలెక్టర్ బంగ్లా దరి పొన్నాడ వంతెన వద్ద నాగావళి నదికి స్నేహితులతో కలిసి మృతుడు రమేష్ ఆదివారం స్నానానికి వెళ్లాడు. నదిలో స్నానం చేస్తూ... ఊబిలో చిక్కుకొని మునిగిపోయాడు. వెంటనే అతని స్నేహితులు రమేష్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తుల సహకారంతో నదిలో గాలింపు చేపట్టారు. స్నానానికి దిగిన రేవుకు సమీపాన వెళు న్న సమయంలో విగతజీవుడై నీటిలో కనిపించాడు. వెంటనే బయటకు తీసి హుటాహుటిన జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రిమ్స్ అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని తండ్రి గురయ్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. తల్లి గోవిందమ్మ రోజువారీ కూలీగా జీవనం సాగిస్తోంది. మృతుడు రమేష్ మధ్యలోనే చదువుకు స్వస్తి పలికి తల్లిదండ్రులకు ఆర్థికంగా సాయపడాలన్న ఆలోచనతో నగరంలోని జిటి రోడ్డులోని స్టిక్కరింగ్ షాపులో పనిచేస్తున్నాడు. అతనికి చెల్లెలు భవాని ఉంది. అప్పటి వరకు తమ కళ్లెదుటే తిరిగిన కుమారుడు విగతజీవిగా పడి ఉండడాన్ని చూసి రమేష్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఇంటి నుంచే ఉపాధి కల్పనకు రిజిస్ట్రేషన్

శ్రీకాకుళం అర్బన్: నిరుద్యోగ యువతీ యువకులు జిల్లా ఉపాధి కార్యాలయానికి రాకుండానే ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. employment.ap.gov.in వెబ్ పోర్టల్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు విద్యార్హతలు నమోదు చేసుకొనేందుకు సౌలభ్యం ఉందని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఆపై విద్యార్హత పొందిన వారు, పదో తరగతి లోపు చదువుకున్న వారు తమ మొబైల్, ల్యాప్‌టాప్, వ్యక్తిగత కంప్యూటర్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. వెబ్ పోర్టల్‌లో ముందుగా లాగిన్ క్రియేట్ చేసుకుని తర్వాత ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత జిల్లా ఉపాధి కార్యాలయంలో దరఖాస్తును పరిశీలించి, ఆమోదం తెలిపిన తర్వాత వ్యక్తిగత మొబైల్ నంబరుకు మెసేజ్ వస్తుందని తెలిపారు. ఆ మెసేజ్ వచ్చిన తర్వాత దరఖాస్తుదారులు లాగిన్ అయి ఎంప్లాయిమెంట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఎంప్లాయిమెంట్ కార్డు ఉన్న వారు వారి రెన్యువల్, అదనపు విద్యార్హతల నమోదును ఆన్‌లైన్‌లోనే చేసు కోవచ్చని పేర్కొన్నారు. వెబ్ పోర్టల్‌లో నమోదైన వారికి రాష్ట్రంలో ఎక్కడ జాబ్‌మేళా నిర్వహించినా సమాచారం వస్తుందని తెలిపారు. ఈ సౌకర్యాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పిచ్చి మొక్కలతో నిండి ఉన్న కాలువ

సాగునీరు అందేనా!

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

గత ఖరీఫ్ సీజన్ సాగునీరు అందక తీర ప్రాంత పంచాయతీ రైతులు తీవ్ర అబ్బందులు పడ్డారు. వచ్చే ఖరీఫ్‌కైనా రైతులకు సాగునీరు అధికారులు అందిరా? అని ఎదురు చూస్తున్నారు. మండలంలోని మేఘవరం ఆర్ కాలువకు సంబంధించి జిజి ఛానల్ ద్వారా మరువాడ, మేఘవరం, కె.లింగూడు, మూలపేట, కొల్లిపాడు, లక్కివలస పంచాయతీల్లో 15 వందల ఎకరాలకు సాగునీరు అందించడంలో వంశధార అధికారులు గతేడాది విఫలమయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో జూన్‌లో తేలిక పాటి వర్షాలు పడడంతో కొంతమంది రైతులు వరి నాట్లు వేశారు. జులైలో ఇంజిన్లతో మరికొంత మంది రైతులు వరి నాట్లు వేశారు. వరి నాట్లు వేసిన తరువాత వర్షాలు కురవక, చెరువుల్లో నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులకు, స్థానిక నాయకులకు రైతులు మొర పెట్టుకున్నా కనీసం చుక్కనీరు అందించలేక పోయారు. వంశధార అధికారులు ఏప్రిల్, మే నెల్లో వంశధార కాలువలు మరమ్మతులు చేయకుండా ఆగస్టులో వచ్చి తూతూ మంత్రంగా చూసి వెళ్లిపోయే పరిస్థితులు ఉన్నాయి. పాలతలగాం నుంచి మూలపేట వరకు కనీసం కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, జంగిల్‌ను తొలగించ లేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని రైతులు వాపోతున్నారు. గతేడాది నుంచి ఈ తీర ప్రాంత పంచాయతీలకు సాగునీరు అందించకుండా... రెవెన్యూ అధికారులు రైతులపై ఒత్తిడి చేసి మరీ శిస్తు వసూలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిజి ఛానల్ మరమ్మతులు చేసిన కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తీర ప్రాంత పంచాయతీ పొలాలకు ఈ ఏడాదైనా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

జీడి గిట్టుబాటు ధరపై ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి- పలాస

జీడికి 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసే వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు హెచ్చరించారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో జీడి రైతు కృష్ణారావు అధ్యక్షతన జీడి గిట్టుబాటు ధరపై జీడి రైతుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది పంట కాలంలో వర్షాభావ పరిస్థితిలో తీవ్ర పంట నష్టం వాటిల్లిందని అన్నారు. జీడి రైతులకు వాతావరణ బీమా అమలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో వివిధ పార్టీలు జీడి రైతులకు హామీనిచ్చాయని అన్నారు. ఆ హామీలను నూతన ప్రభుత్వం ఏర్పడే దాకా, పిక్కలను ధర నిర్ణయించకుండా... దళారులకు అమ్మకూడదని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో టి.భాస్కరరావు, కె.గురయ్య, అంబటి రామకృష్ణ, సిహెచ్.వేణుగోపాల్, యం.బాలానందం, టి.సురేష్, బి.మధు, వై.జోగారావు, అర్లి దానేసు, పి.ప్రకాష్, కె.రాజారావు, ఎన్.గణపతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఎయిడ్స్ రోగులపై వివక్ష వద్దు

శ్రీకాకుళం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- శ్రీకాకుళం

హెచ్ఐవి, ఎయిడ్స్‌తో మృతి చెందిన వారిని గుర్తుకు చేసుకుంటూ వారిపై ప్రేమ, సంఘీభావం తెలియచేద్దామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి ప్రసాదరావు అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మాకర దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు నగరంలోని కొవ్వొత్తులు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా మే మూడో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మాకర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్‌తో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ... వారి కుటుంబానికి, హెచ్ఐవి, ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారికి మేమున్నాం అనే భరోసా ఇవ్వడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ఎయిడ్స్ రోగులపై వివక్షత చూపరాదని, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడంతో పాటు క్రమం తప్పకుండా మందులు వాడుతుంటే ఎంతో కాలం జీవించవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రసాద రావు, యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం, రెడ్‌క్రాస్, సిబ్బంది, డాక్టర్ మంత్రి వెంకటస్వామి, డిపిఎం ఉమామహేశ్వర రావు, వివిధ స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేంద్రరెడ్డి ఆధ్వర్యాన ఎచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారిని గుర్తుకు చేసుకుంటూ వైద్య సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కమ్యూనిటీ ఆస్పత్రిని నుంచి బస్టాండ్ వరకు సాగింది.

పొందూరు: మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఐసిటిసి ఆధ్వర్యాన అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్.రామదాసు, సిహెచ్‌సి వైద్యులు అనీల్, ఐసిటిసి కౌన్సిలర్ కె.నాగవల్లి, ల్యాబ్ టెక్నిషియన్ ఎం.విజయలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది, ఎఎన్ఎంలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్యుని కళ్యాణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైశాఖ శుద్ధ ఏకాదశిని పుస్కరించుకుని అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి వారి కళ్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ సాంప్రదాయ బద్ధంగా సాగిన ఈ కళ్యాణ వేడుకలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉషా, చాయ, పద్మినీ సమేతుడైన సూర్యనారాయణ స్వామి కళ్యాణానికి అనివేటి మండపంలో అలంకరించారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఇఒ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

పెరిగిన ఆదాయం

వైశాఖ మాసం ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. దీనివల్ల ఆలయానికి ఒక్క రోజున రూ.17.35 లక్షల మేర ఆదాయం సమకూరింది. యాత్రికులకు వివిధ టిక్కెట్లు విక్రయాల ద్వారా రూ.13,04,100, విరాళాల రూపంలో రూ.1,21,675, ప్రసాదాల విక్రయాల రూపంలో రూ.3,27,720 ఆదాయం సమకూరినట్టు ఇఒ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సుందరయ్య ఆశయాలు సాధిద్దాం

శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

పలాస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

టెక్కలి రూరల్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో పుచ్చలపల్లి సుందరయ్య దిక్సూచి అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ దేశంలో విప్లవోద్యమ నిర్మాణంలో సుందరయ్య కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నేతృత్వం వహించి నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నడిపారన్నారు. భారత పార్లమెంట్ తొలి ప్రతిపక్ష నేతగా నిరుపమానమైన ప్రతిభ చూపారని గుర్తు చేశారు. సిపిఎం వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన ఆయన పార్టీ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆయన చూపిన పోరాట మార్గాన మరిన్ని సమరశీల పోరాటాలు నిర్మించి ముందుకు సాగిన నాడే ఆయనకిచ్చిన ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.జి.కె.మూర్తి, కె.శ్రీనివాసు, సత్తారు భాస్కరరావు, ఆదినారాయణమూర్తి, ప్రభాకరరావు, సూరయ్య, కొత్తకోట అప్పారావు, తిరుపతిరావు, ప్రకాశరావు, చంద్రశేఖర్, కామినాయుడు పాల్గొన్నారు.

సోంపేట: ఉద్దాన ప్రాంతానికి మామిడిపల్లి ఒకానొక దశలో ఉద్యమ కేంద్రంగా పనిచేసిందని, భవిష్యత్‌లోనూ అటువంటి విప్లవాత్మకమైన పాత్రని మామిడిపల్లి పోషించాలని సిపిఎం సీనియర్ నాయకులు కర్రి సింహాచలం అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జుత్తు నీలకంఠం, తెప్పల పాపారావు, సిపిఎం పాతిన ముకుందరావు, గోరకల మన్మథరావు, తాళపత్ర రామారావు, గేదెల చిన్నబాబు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: సుందరయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు పిలుపునిచ్చారు. స్థానిక ఐటియు కార్యాలయం ఆవరణలో మండల కమిటీ కన్వీనర్ కొల్లి ఎల్లయ్య ఆధ్వర్యాన సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హెచ్.ఈశ్వరరావు, పాళిన సాంబమూర్తి, ఉర్జాన లక్ష్మణరావు, దవళ లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, ఉదయ్, గౌరమ్మ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : సుందరయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. చిలకపాలెం గ్రామంలో అరినామ అక్కివలస నాగార్జున అగ్రికం పరిశ్రమ వద్ద పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ సుందరయ్య భూ సంస్కరణలు అమలు కోసం భూ పోరాటాలు సాగించారని, పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై గలమెత్తి వాటి పరిష్కారం కోసం సుందరయ్య పని చేశారని గుర్తు చేశారు.

ప్రజల కోసం తన ఆస్థులు, జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. సమ సమాజం కోసం సుందరయ్య పని చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తోనంగి నందోడు, కోరాడ అప్పన్న, వివిధ సంఘాల నాయకులు లింగాల రామప్పడు, రమణ, ఎచ్చెర్ల రాజు, పుట్ట అప్పలనాయుడు, బి.అప్పలరాజు, తోనంగి సుశీల, టి.సూరమ్మ, పి.పార్వతి, కె.బుడ్డోడు, ఆర్.కృష్ణ, టి.గోవింద, బి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

పలాస : సుందరయ్య ఆశయాలు సాధనకు కృషి చేయడం ద్వారా కార్మికవర్గ రాజ్యం స్థాపించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అన్నారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అధ్యక్షతన సుందరయ్య వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జీడి రైతుల సంఘం జిల్లా కార్యదర్శి టి.అజయ్‌కుమార్, సిపిఎం నాయకులు వి.కృష్ణారావు, ఎన్.ఢిల్లేశ్వరి, ఎ.వీరాస్వామి, జె.భాగ్యలక్ష్మి, టి.భాస్కరరావు, లావణ్య, కె.గురయ్య పాల్గొన్నారు.

మందస : మండలంలోని భైరిసారింగపురంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎం.ధర్మారావు, కె.కేశవరావు, ఆర్.దిలీప్‌కుమార్, చిరంజీవి, వల్లభరావు, జయరాం, లక్ష్మీనారాయణ, హమాలి సంఘం నాయకులు బి.దుర్యోధన, ఎన్.లచ్చయ్య, వెంకటి, నాగేష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని నగరంపల్లిలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు నెయ్యిల మోహనరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు బి.ఆనందరావు, ఎస్.మనోజ్, ఎన్.చంద్రయ్య, బమ్మిడి రామకృష్ణ, తమ్మినేని భాస్కరరావు, బి.సుగుణావతి, ఎన్.ఈశ్వరమ్మ, ఎన్.ధనలక్ష్మి, బి.లక్ష్మి పాల్గొన్నారు.

కంచిలి: స్థానిక సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి సిఐటియు నాయకులు కె.శ్రీనివాసు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, సంగారు లక్ష్మీనారాయణ, ఆశా వర్కర్ల యూనియర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అమరావతి, కె.ప్రేమలత, ఊర్వశి, సుమతి, జ్యోత్స్న పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలం సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వి.లక్ష్మి, మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పూజారిపేట లోని ప్రజా ఉద్యమనేత బొడ్డేపల్లి మోహనరావు స్వగృహం వద్ద సుందరయ్య వర్ధంతి సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పూర్వపు జిల్లా కార్యదర్శి బొడ్డేపల్లి కనకలక్ష్మి, భవన నిర్మాణ కార్మికులు టి.రాజారావు, పి.తిరుపతిరావు, కె.రమ, కె.కమల తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఆమదాలవలస : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మోహనరావు

కంచిలి : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

పెరటి తోటలు ఆరోగ్యానికి బాటలు

ప్రజాశక్తి- రణస్థలం

ఇంటి పరిసరాల్లోనే ఒకటికి పది రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల చెట్లు, ఔషధ మొక్కలు ఉంటే ఇక ఆ ఇంట్లోని పిల్లలు, పెద్దలు, వృద్ధులకు పౌష్టికాహార లోపం ఉండనే ఉండదని మంచి ఆరోగ్యానికి బాటలని ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రభుత్వం రణస్థలం, లావేరు మండలాల్లో విస్తృతంగా ప్రకృతి వ్యవసాయం చేపడుతుంది. ప్రతి ఇంటి ఆవరణలోనూ కూరగాయలు, పండ్ల చెట్లు పెంచుకోవటం ఆనవాయితీగా వస్తుండేది. ఇప్పుడు పరిస్థితులు ఎంత మారిపోయాయంటే పెరటి తోటలు దాదాపుగా కనుమరుగై పోయాయి. ఇతర వృత్తులు చేసుకునే వారితో పాటు వ్యవసాయ కూలీల కుటుంబాలే కాకుండా రైతు కుటుంబాలు కూడా కూరగాయలను పూర్తిగా దుకాణాలపైనే ఆధారపడే దుస్థితి వచ్చింది. ఫలితంగా గ్రామీణుల్లో పౌష్టికాహార లోపం పెచ్చుమీరి పట్టణాల్లో పేద, మధ్యతరగతి వారి పరిస్థితి ఇంతేనని, పెరటి తోటలు, మేడలపైన ఇంటిపంటల సాగు వైపు దృష్టి సారించడం ద్వారానే ఏడాది పొడవునా రకరకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు అందుబాటులోకి తేవటం సాధ్యమవు తుంది. ఏపిలో కమ్యూనిటీ బేస్ట్ ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపిసిఎన్ఎఫ్) పెరటి తోటల సాగును విస్తృతంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. రైతు కుటుంబాలు, వ్యవసాయ కూలీల కుటుంబాల కోసం వారి ఇళ్ల పరిసరాల్లోనే 'సూర్యమండలం' నమూనాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అనేక రకాల కూరగాయలు, ఆకుకూరలు, దుంపకూరలు, తీగజాతి కూరగాయలు, పండ్లను ఏడాది పొడవునా సాగు చేసుకునేందుకు ప్రోత్సహిస్తుంది.

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

కషాయాలతో పంటల సాగు

సొంతంగా తయారు చేసుకునే ఘనజీవామృతం, జీవామృతం, కషాయాలతోనే పంటలు సాగు చేసుకోవచ్చు. రకరకాల దేశవాళీ కూరగాయ వంగడాల పరిరక్షణ సాధ్యమవుతుంది. చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు కూరగాయలు, ఔషధాలు కొనే ఖర్చు తగ్గి డబ్బు ఆదా అవుతుంది. ఆరోగ్యం చేకూరుతుంది. అయితే, ఇంటి దగ్గర తగినంత చోటు లేని కుటుంబాలు చాలా ఉన్నాయి. ఇటువంటి వారికి ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ కిచెన్ గార్డెనింగ్ ప్లాట్స్ కేటాయించి, సూర్యమండలం నమూనాలో కూరగాయల సాగును ఏపి రైతు సాధికార సంస్థ ప్రోత్సహిస్తుంది. తీగ జాతి పాదులు పాకడానికి పందిళ్లు వేయాలి. సూర్యమండలం చుట్టూ కంచెకు కూడా పాకించవచ్చు, పందిళ్లకు తీగ జాతి మొక్కలను తొలి దశలో జాగ్రత్తగా పాకించాలి. కూరగాయ మొక్కల మధ్యలోనూ నేలపై పాకే గలిజేరు వంటి ఆకుకూర మొక్కలను పెంచుకోవచ్చు, సజీవ ఆచ్ఛాదనగా కూడా పనికివస్తుంది. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలి.

'సూర్యమండలం' పంటల నమూనా అంటే?

సౌరవ్యవస్థను పోలినరీతిలో అంటే గుండ్రని ఆకారంలో ఎత్తు మడులను తయారుచేసి వాటిలో వేర్వేరు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లచెట్లు, ఔషధ మొక్కలు సాగు చేసే పద్ధతి ఇదేనని ప్రకృతి వ్యవసాయం సూచిస్తుంది. ఎంత స్థలంలోనైనా సూర్య మండలం నమూనాలో పెరటితోటను ఏర్పాటు చేసుకోవచ్చు. విస్తీర్ణం పెరిగే కొద్దీ పంటల వైవిధ్యాన్ని పెంచవచ్చు. పండ్ల మొక్కలను నడి మధ్యలోనే కాకుండా సూర్యమండలం చుట్టూ కూడా వేసుకోవచ్చు. ఇలా ఉండాలంటే కనీసం రెండు సెంట్ల స్థలంలో సూర్యమండలం ఏర్పాటు చేసుకోవటం బాగుంటుంది. అరసెంటు, సెంటు స్థలంలో సూర్య మండలం నమూనాలో ఎత్తుమడులు ఏర్పాటు చేసుకుంటే కుటుంబానికి ప్రతిరోజూ కిలో వరకు కూరగాయలు, ఆకుకూరలు వస్తాయి (అంతస్తుల మాదిరిగా, అన్ని పంటలూ కలిపి)మడులను సిద్ధం చేసుకునేటప్పుడు మట్టిలో ఒక సెంటు స్థలంలో సుమారు 50 కిలోల చొప్పున ఘన జీవామృతాన్ని కలపాలి. ప్రతి 15 రోజులకొకసారి మడుల్లో మొక్కలు పూర్తిగా తడిసేటట్లు ద్రవజీవామృతాన్ని పిచికారీ చేయాలి. ఒక వేళ పంటలపై చీడపీడల బెడద ఎక్కువగా ఉంటే అవసరాన్ని బట్టి కషాయాలను పిచికారీ చేసుకోవలసి ఉంటుంది. వీలైనన్ని ఎక్కువ రకాల పంటలు వేసుకోవాలి. పంటలను కాలానుగుణంగా మార్పిడి చేసుకోవాలి. ఒక మడిలో వేసిన పంటలు కాపు పూర్తయ్యాక అక్కడ మళ్లీ అవే పంటలు వేయకూడదు. అంతర పంటలను ఎన్నుకునేటప్పుడు మిత్ర పంటలు పక్క పక్కన ఉన్నట్లయితే మొక్కల ఎదుగుదల బాగుంటుంది. సూర్య మండలం లో 365 రోజులూ పంటలు ఉండేలా కొద్ది వారాల వ్యవధిలో విత్తనాలు, మొక్కలు నాటుకునేలా ప్రణాళిక వేసుకోవాలి. కాలానుగుణమైన పంటల సరళి ఎంపికే ముఖ్యం. ప్రతిమడిలో పంటల వైవిధ్యం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. మొక్కల మధ్య సంబంధాలు, సూక్ష్మజీవులతో సహ జీవనం అనే ప్రకృతి వ్యవసాయ ప్రాథమిక సూత్రాలను ఇక్కడ అనుసరించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు. సూర్య మండలం మధ్యలో వలయాకారంలో ఉన్న మడిలో తక్కువ నీడనిచ్చే పండ్ల మొక్కలను పెంచుకోవచ్చు ఉదాహరణకు అరటి, బొప్పాయి. సూర్యమండలం మధ్యలో నీటిపంపు వచ్చేలా చూసుకుంటే బాగుంటుంది. మధ్యలో నుంచి చివరి మడుల వరకు కాలువలు ఉన్నట్లయితే, నీరు అన్ని చోట్లకు సులువుగా చేరుతుంది. ఎక్కువ అయిన నీరు బయటకు పోయే ఏర్పాటు చేసుకోవాలని ఉంటుంది. ఎత్తు మడులు చేసుకొని, చుట్టూ ఇటుకలతో నిర్మాణం చేసుకొంటే ఎక్కువ కాలం మడులు చెదిరిపోకుండా ఉంటాయి. మడుల మధ్య కాలి బాటలపై పందిరి వేసుకొంటే తీగ జాతి మొక్కలను ఎగ పాకించుకోవచ్చును. సూర్యమండలం చుట్టూ కంచె ఉంటే పశువుల నుంచి రక్షణగా ఉంటుంది. తీగ జాతి మొక్కలను కంచెపై పాకించవచ్చు. మడుల అంచుల్లో దుంప జాతి మొక్కలు, ప్రతి మడిలో ఒక వరుసలో ఒక కాయగూర పంట, రెండు కాయగూర మొక్కల మధ్యలో ఆకు కూరలు విత్తుకొని పండించుకోవచ్చు.

ప్రయోజనాలు ఎన్నో...

'సూర్యమండలం' ప్రయోజనాలు ఏడాది పొడవునా తాజా కూరగాయల లభ్యత. దూరప్రాంతాల నుంచి ఇంధనం ఖర్చు చేసి కూరగాయల రవాణా చేయాల్సిన అవసరం ఉండదు. పెరటితోట ఉన్న కుటుంబానికి ఏడాది పొడవునా సమతుల ఆహారం అందుతుంది. పౌష్టికాహార లభ్యత వల్ల ఆరోగ్యం మెరుగవుతుంది. వైద్య ఖర్చులు తగ్గుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహార భద్రత పెరుగుతుంది. కుటుంబానికి రోజుకు ఒక కిలో కూరగాయలు, పండ్లు ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి.

స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది

కుద్దిరాంలో కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని 21వ వార్డు కుద్దిరాంలో ఎటువంటి పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున ఎస్ఐ వెంకటేష్ సిబ్బందితో కలిసి కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పలు గృహాల వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలను గుర్తించి యజమానుల నుంచి పత్రాలను అడిగి పరిశీలించారు. ఈ తనిఖీల్లో నాలుగు ద్విచక్ర వాహనాలకు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు వాహనానికి సంబంధించిన పత్రాలు అన్ని సరిచూసుకుని కొనుగోలు చేయాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు మైనర్లకు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు సురేష్

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చింతలపేటలో శ్రీకాకుళం పట్టణంలోని సన్ రైజ్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలందరూ ఇళ్లకే పరిమితం కావాలన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి వద్దనే ఉండాలని, ఆరుబయట తిరగవద్దని ప్రజలకు సూచించారు. ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరు బిపి, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిఒక్కరూ ఉదయం అరగంటసేపు వ్యాయామం చేయా లన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామస్తులతో కలిసి గ్రామంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ఉచిత విద్య

ప్రజాశక్తి- రణస్థలం

2024-2025 విద్యా సంవత్సరంలో 5, 6, 7 తరగతుల్లో ఉచిత ప్రవేశం పొందే విద్యార్థులకు జూన్ 2న పరీక్ష నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు హాజరు కావాలని రణస్థలం మండలం కొండములగాం గ్రామ సమీపంలో ఉన్న ఐరిష్ శకళ్య స్కూల్ డైరెక్టర్ కె.హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది నిరుపేదలు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నామని, ఈ ఏడాది టాలెంట్ టెస్ట్ నిర్వహి స్తున్నామని తెలిపారు. ఆ దిశలోనే ఉత్తమ ప్రతిభ కనబరచిన మొదటి పది మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని, మొదటి స్థానంలో నిలిచిన మొదటి ఐదుగురు విద్యార్థులకు 10వ తరగతి వరకు చదువు, పుస్తకములు, యూనిఫామ్, రవాణా సదుపాయం పూర్తిగా ఉచితంగా కల్పించబడుతుందన్నారు. మిగతా ఐదుగురు విద్యార్థులకు ఐరిస్ శకల్య స్కూల్ ద్వారా రూ.5 వేలు స్కాలర్ షిప్ ఇవ్వబడుతుందని, అర్హత, ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని పూర్తి వివరాలకు కొండములగాం రోడ్‌లో గల ఐరిష్ శకళ్య స్కూల్ ఆఫీస్ వద్ద సంప్రదించాలని కోరారు.


పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సీజ్ చేసిన టిప్పర్లు

మూడు టిప్పర్లు సీజ్

పొందూరు: పొందూరు రెవిన్యూ పరిధిలో 42వ సర్వేనెంబర్ పైడికొండ వద్ద అనుమతులు లేకుండా కంకరను తవ్వి తరలిస్తున్న మూడు టిప్పర్లను రెవిన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని బొడ్డేపల్లి వద్ద జరుగు తున్న రైల్వేట్రాక్ పనులకు సంబంధించి అవసరమైన కంకర కోసం రెవిన్యూ అధికారుల అనుమతి కోరుతూ కాంట్రాక్టర్ దరఖాస్తు చేశారు. అయితే రెవిన్యూ అధికారులు ఎటువంటి అనుమతులను మంజూరు చేయలేదు. దరఖాస్తు చేసినట్లు రశీదు ఇచ్చారు. దీనినే అనుమతులుగా చూపుతూ 10 రోజులుగా టిప్పర్లతో కంకరను తరలి స్తున్నారు. దీనిపై తహశీల్దార్‌కు ఫిర్యాదు రావడంతో ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ రాధ, విఆర్ఓ, పోలీసులు వెళ్లి దాడిచేసి టిప్పర్లను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కలిశెట్టి పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

విజయనగరం టిడిపి ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మండలంలో పలువురిని ఆదివారం పరామర్శించారు నెదురుపేటకు చెందిన బస కిరణ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడటంతో కిరణ్ స్వగృహం వద్ద పరామర్శించారు. అలాగే నెదురు అప్పన్న ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటివద్ద కోలుకోవడంతో ఆయనని పరామర్శించారు. నేతేరు లక్ష్మీపురంకు చెందిన బోర గణేష్, గాలి సంతోష్ ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటివద్ద కోలుకుంటున్న వీరిని పరామర్శించారు. ఈయనతో స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

కూలిన వంతెన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని మరువాడ పంచాయతీలో మేఘవరం ఆర్.వంశధార కాలువపై ఎం.మరువాడ సమీపంలోని నిర్మించిన వంతెన ఆదివారం కూలిపోయింది. దీంతో ఎం.మరువాడ, డి.మరువాడ గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లాలన్నా, రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలన్నా ఈ వంతెనే ప్రధాన ఆధారం. ప్రస్తుతం వేసవిలో కాలువలో దిగి వెళ్లిపోవచ్చు. వర్షాకాలం, కాలువలో నీరు చేరితే ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు. ఉన్నత అధికారులు, పాలకులు స్పందించి త్వరితగతిన వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

కాలువపై కూలిన వంతెన

ఎన్‌టిఆర్ అభిమానుల రక్తదానం

టెక్కలి రూరల్ : రక్తదాతలకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సునీత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నందమూరి కుటుంబ అభిమాన సంఘాలు సంబరాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని టిడిపి నాయకులు గొండు శంకర్ అన్నారు. జూనియర్ ఎన్‌టిఆర్ 41వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా ఎన్‌టిఆర్, మోక్షజ్ఞ సేవా సంఘం ఆధ్వర్యాన నగరంలోని డేఅండ్‌నైట్ కూడలిలో ఉన్న విజయశ్రీ బ్లడ్‌బ్యాంక్‌లో 41 మంది అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంబించిన శంకర్ మాట్లాడుతూ నందమూరి కుటుంబం నుంచి వచ్చిన మూడోతరం నటుడు జూనియర్ ఎన్‌టిఆర్ అని, ఆయన సినీ రంగంలో అనేక విజయాలు అందుకున్నారన్నారు. అబిమానులు సామాజిక బాధ్యతను గుర్తించుకుని సేవ చేయాలన్నారు.నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, డేవిడ్, సురేంద్ర, సురేష్, ప్రసాద్, మోహన్, భాస్కర్, మహేష్, దుర్గా, రాజు, వెంకీ, బాసి, జనార్దన్, రాంకుమార్, వాసు పాల్గొన్నారు,

టెక్కలి రూరల్ : సినీ నటుడు జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు సందర్భంగా టెక్కలి ఎన్‌టిఆర్ అభిమానులు టీం ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సునీత నేతృత్వంలో టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ అభిమానులు పాల్గొని 41 యూనిట్ల రక్తదానం చేశారని టీం తారక్ ట్రస్ట్ జిల్లా ప్రెసిడెంట్, టెక్కలి ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ దాలిశెట్టి భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో వెంకీ, కిరణ్, పవన్, లక్ష్మణ్, బాలకృష్ణ, ఢిల్లీ, అభిమానులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : రక్తదానం చేస్తున్న అభిమానులు

విద్యార్థులకు పలు అంశాలను వివరిస్తున్న హేమంత్‌కుమార్

విజ్ఞాన శిబిరాలతో ప్రయోజనాలు

లావేరు: వేసవి విజ్ఞాన శిబిరంలో చాలా విషయాలు నేర్చుకుంటున్నామని పదవ తరగతి విద్యార్థి హేమంత్ కుమార్ అన్నారు. ఆదివారం లావేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో హేమంత్ కుమార్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా వేసవి విజ్ఞాన శిబిరాలకు తాను హాజరవు తున్నానని ఎన్నో విషయాలు నేర్చుకున్నానని వాటిని లావేరు హైస్కూల్లో కూడా చెబుతున్నానని విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రంథాలయ సహాయకులు వీర భద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: జబ్బవాపు వ్యాధి బారిన పడిన పశువులు బతకటం కష్టమని, అందుకే ప్రతి పాడి రైతూ తమ పశువులకు ఉచిత జబ్బవాపు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించు కోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కురుడు పంచాయతీ పాకివలస, మెండపేట గ్రామాల్లో 114 పశువులకు ఆదివారం ఉచిత జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాలు షెడ్యూల్ ప్రకారం వేస్తున్నామన్నారు. రైతులందరూ పశు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. వెటర్నరీ అసిస్టెంట్ ముకుందరావు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

జగ్గుశాస్త్రులపేటలో అన్నదానం

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని 1వ వార్డు జగ్గుశాస్త్రుల పేట వద్ద ఎండల మల్లికార్జున స్వామి ఆలయం 71వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం వైశాఖ ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయ అర్చకులు మీగడ కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్ముడు పేట, తిమ్మాపురం, జగ్గు శాస్త్రులపేట, జొన్నవలస, పార్వతీశం పేట, అప్పలరాజు కాలనీ, గాజుల కొల్లివలసకు చెందిన సుమారు 2వేల మంది ప్రజలు హాజరయ్యారు. మాజీ కౌన్సిలర్ దుంపల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు రుణపడి ఉంటా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజక వర్గం నుంచి పోటీ చేసిన తనకు సాయపడ్డ వారందరికి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నియోజక వర్గ పార్టీ నాయకులతో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగా తాను ఒంటరిని కాదని, కార్యకర్తలు, అభిమానుల అండ దండలతోనే ఎన్నికల్లో నిలిచానని, అడుగడుగున వెన్నంటే ఉండి తనకు సహకరించిన ప్రతిఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. ఓటింగ్ ప్రక్రియలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనేలా చైతన్యం చేయడంలో వార్డు ఇన్‌ఛార్జులు కృషి చేశారన్నారు. వారి కృషి ఫలితంగా టిడిపి, జనసేన, బిజెపి కూటమి బలపడిందన్నారు. రెండు నెలల పాటు నాయకులు, నగరంలోని డివిజన్ ఇన్‌ఛార్జులు, కార్యకర్తల అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించే వారు అప్రమతంగా ఉండాలని శంకర్ సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు రెడ్డి గిరిజా శంకర్, చల్లా వాసు, పిఎంజెబాబు, రెడ్డి శివన్నాయుడు, కొర్ను నాగార్జున, సూరిబాబు, సర్సింహమూర్తి, సింతు సుధాకర్, కోరాడ హరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొండు శంకర్

రాజకీయ క్రీడలో బలిపశువులం

కవిటి: రాజకీయ క్రీడలో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు రెవెన్యూ అధికారుల తీరుతో గత 20 ఏళ్లుగా మోసపోతూనే ఉన్నామని బెంతు ఒరియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ మండల కేంద్రంలోని బెంతొరియాలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 144వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో తరగతి, ఉప తరగతి పేరుతో కూడిన ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం జారీ చేయకపోవడంతో బెంతొరియా విద్యార్థులు ఉపాధి, ఉన్నత చదువులు కోల్పోతున్నారని అన్నారు. తమ బిడ్డలకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ (జగనన్న విద్యా దీవెన) మంజూరు కావడం లేదని, ఎపి ఉన్నత విద్యా మండలి నిర్వహించే ప్రవేశ పరిక్షల కౌన్సెలింగ్‌లో తిరస్కరిస్తున్నారని తెలిపారు. ఈ కారణంతో అనేక మంది బెంతొరియా విద్యార్థులు చదువుకి దూరమవుతున్నారని అన్నారు. మరోవైపు ప్రభుత్వాలు మారినప్పుడల్లా కమిటీల పేరుతో కాలక్షేపం చేస్తూ ఎన్నికలు వచ్చేసరికి రాజకీయ పార్టీలు ఓట్లు వెయ్యించుకుని తమను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఇకనైనా స్పందించకపోతే తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దీక్షలో పాల్గొన్న బెంతొరియా ప్రతినిధులు

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావద్దు

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని, ఒత్తిడికి గురికావద్దని కాశీబుగ్గ వైద్యులు టి.బాలకృష్ణ, తెప్పల ఆనందరావు, మట్ట ఖగేశ్వరరావు అన్నారు. మండలంలోని నీలావతి గ్రంథాలయం ఆవరణలో యువివి అధ్యక్షులు ఇసాకోటి జోగారావు అధ్యక్షతన ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక 22వ వార్షికోత్సవం వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు దుమ్ము శంకరరావు, సాహుకారి వల్లభరావు, బద్రి కూర్మారావు, లండ జగన్నాథం, పెద్దింటి శశిధరవర్మలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే ఇటీవల విడుదలైన పదో తరగతిలో ప్రతిభ చూపించిన విద్యార్థులకు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో యువివి ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, గౌరవ అధ్యక్షులు బి.ఓంకార్, గౌరవ సలహాదారులు కె.ప్రకాశరావు, టి.వాసుదేవరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

నూతన కార్యవర్గ ఎన్నిక

గౌరవ అధ్యక్షులు కుత్తుం ప్రకాశరావు, అధ్యక్షులుగా బొమ్మాళి శివ, ఉపాధ్యక్షులు పోతనపల్లి గీతమ్మ, ప్రధాన కార్యదర్శి గోరకల లోకేశ్వరరావు, ఉప కార్యదర్శి యంపల్ల కామేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి జీనగ సీతారామయ్య, సహాయ కార్యదర్శి కుత్తుం ప్రసాద్, అకాడమిక్ సెల్ కన్వీనర్ కుత్తుం వినోద్, గ్రంథాలయ కన్వీనర్ పాలిన కృష్ణారావు, గ్రంథాలయ సహాయ కన్వీనర్ తామాడ మహేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ దున్న సోమేశ్వరరావు, స్పోర్ట్స్ కార్యదర్శి సైని మధు, ఆడిట్ కమిటీ సుబుద్ధి సంతోష్ కుమార్, గ్రంథాలయ కమిటీ సభ్యులు పోతనపల్లి మాధవరావు, సహాయ ఆర్థిక కార్యదర్శి తంగుడు కగేశ్వరరావు, గౌరవ సలహాదారులు బత్తిని ఓంకారం తదితరులను ఎన్నుకున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మృతి చెందిన మల్లేష్

మండలంలోని చిన్న వెంకటాపురంలో ఈనెల 16న జరిగిన తోపులాటలో గాయపడిన తోట మల్లేష్ (60) విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని టెక్కలి రూరల్ సిఐ సూర్య చంద్రమౌళి తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 16న చిన్నవెంకటాపురంలో పాతపట్నం అమ్మవారికి మొక్కులు చెల్లించడానికి గ్రామస్తుల ందరూ కోళ్లు, మేకలు పట్టుకొని ఆలయం వద్దకు చేరుకున్నారు. మృతుడు కోడి పట్టుకొని మొక్కు చెల్లించానికి ముందుకు రావడంతో ఇదే గ్రామానికి చెందిన పూతి లక్ష్మణరావు, పూతి భానుచందర్, పూతి కర్రెన్న, పూతి రమణ ఏటా మా కుటుంబమే కదా అమ్మవారికి ముందుగా మొక్కలు చెల్లించేది, ఇప్పుడు నువ్వేంటి అందరికంటే ముందు మొక్కు చెల్లించడానికి వచ్చావు అని మల్లేసును ప్రశ్నించారు. దీంతో మల్లేష్ వైపు నుంచి ఐదుగురు వ్యక్తులు, పూతి దానమ్మ వైపు నలుగురు వ్యక్తులు ఒకరినొకరు తోసుకోవడంతో మల్లేష్ కిందిపడి గాయపడ్డాడు. విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఘర్షణపై ఇరు గ్రూపులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ సంఘటనలో ఏ రాజకీయ ప్రమేయం లేదని, తోపులాటలో గాయపడి మృతి చెందారని సిఐ తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని నిమ్మాడ పంచాయతీ చిన్న వెంకటాపురం బూత్ నంబరు 288లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తరుపున బూత్ ఏజెంటుగా తోట మాధవరావు ఉండి అక్కడ రిగ్గింగ్ జరగకుండా అపాడనే అక్కసుతో ఆయన కుమారుడిని తోసేశారని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అమ్మవారి మొక్కుల చెల్లింపుల వారాల్లో అచ్చెన్నాయుడు నేతృత్వంలో టిడిపి నాయకులు మల్లేష్‌పై అతి దారుణంగా హత్యయత్నం చేయడంతో ఆయన మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచారని అన్నారు. ఈ హత్యకు కారుకులైన అచ్చెన్నాయుడు అనుచరులు భానుచంద్ర, పి.లక్ష్మణరావు, రమణ, కర్రెన్నలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

భార్యాభర్తలపై తెనేటీగల దాడి

చికిత్స పొందుతున్న హైమావతి, ఆదినారాయణ

రణస్థలం: మండలంలోని నగర ప్పాలెంకు చెందిన భార్యాభర్తలు పంపురెడ్డి హైమావతి, ఆది నారాయణకు తెనే టీగలు కుట్టి అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోనికి వెళ్తే... నగరప్పాలెం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం కొబ్బరి తోటలో పొలం పనులు చేస్తుండగా ఒక్కసారిగా తెనేటీగలు గుంపులు గుంపులు వచ్చి దాడి చేసినట్లు తెలిపారు. చుట్టుపక్కల పనులు చేస్తున్న వారి బంధువులు తక్షణమే రణస్థలం మండల కేంద్రంలో ఉన్న సూర్య ఆస్పత్రికి తీసుకుని వచ్చి వైద్యసేవలు అందించారు. డాక్టర్ ఇడదాసుల యశ్వంత్ మాట్లాడుతూ హైమావతికి వందకుపైగా తెనేటీగలు మొఖంపై కుట్టినట్లు తెలిపారు. ఆది నారాయణకు కొంతమేర కుట్టాయన్నారు. తెనేటీగలు కుట్టిన వెంటనే ఆస్పత్రికి తీసుకుని రావడం తక్షణమే చికిత్స అందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. తెనేటీగలు, కందిరీగలు కుట్టినవెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకుని వచ్చి చికిత్స అందించాలని, నాటువైద్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని తెలిపారు.

కంబాలరాయుడుపేటలో సంబరాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని కంబాల రాయుడు పేటలో ఆదివారం గ్రామదేవత పెద్దమ్మతల్లి సంబరాలు వైభవంగా ప్రారంభ మయ్యాయి. పాండురంగ సోదర సేవా సంఘం ఆధ్వర్యాన సంబరాలు నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు, సర్పంచ్ వంక చిరంజీవి, వైసిపి నాయకులు వంక శివ శంకర్ తెలిపారు.